# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 24, ఫిబ్రవరి, 2015

ఆమెరికాతో తెలంగాణకు, హైదరాబాద్‌కు ఎంతో అనుబంధం ఉందని, రానున్న కాలంలో ఈ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు, భారత్‌లో ఆమెరికా రాయబారి రిచర్డ్ వర్మ అభిప్రాయపడ్డారు. సచివాలయంలో మంగళవారం వీరిద్దరు సమావేశమయ్యారు.

ఆమెరికాలోని చాలా విశ్వవిద్యాలయాల్లో తెలంగాణ విద్యార్థులు చదువుతున్నారని, అనేక సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, చాలామంది అక్కడే స్థిరపడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. ఆమెరికాకు తెలంగాణ పౌరులు నిత్యం రాకపోకలు సాగిస్తూనే ఉన్నారని అన్నారు. దీనికి రిచర్డ్ వర్మ బదులిస్తూ అనేక రంగాలలో తెలంగాణకు ఆమెరికాకు సంబంధాలు ఉన్నాయన్నారు. ఆమెరికా అధ్యక్షుని కోసం తయారు చేసే హెలికాప్టర్ విడి భాగాలు కూడా హైదరాబాద్‌లోనే తయారయ్యే విషయాన్ని రిచర్డ్ వర్మ గుర్తు చేశారు. గచ్చిబౌలిలో కొత్తగా నిర్మిస్తున్న ఆమెరికా కాన్సులేట్ కార్యాలయ పురోగతి గురించి కూడా చర్చించారు. దేశంలో నాలుగు ఆమెరికా కాన్సులేట్ కార్యాలయాలు ఉంటే అందులో ఒకటి హైదరాబాద్‌లోనే ఉండడాన్ని బట్టి తమ దేశం తెలంగాణకు ఇస్తున్న ప్రాధాన్యత అర్థం అవుతున్నదన్నారు. తమ దేశానికి చెందిన చాలా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయని, పరిశ్రమలు స్థాపిస్తున్నాయని వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక రంగాలపై దృష్టి పెట్టిందని, వీటిని ఆమెరికా ప్రభుత్వం, ఆమెరికా కంపెనీలు నిశితంగా గమనిస్తున్నాయని వర్మ చెప్పారు. తాను కూడా చాలా మంది అధికార, అనధికార ప్రముఖులు, సంస్థలతో సమావేశమయ్యాయని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానపర నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చ జరుగుతున్నదని చెప్పారు. చాలా కార్యక్రమాలు వినూత్నంగా,

అభివృద్ధి సాధించే దిశగా ఉన్నాయని అభినందించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలపై  వర్మ ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు.  ముఖ్యంగా హైదరాబాద్ నగరంపై అందరి దృష్టి వుందన్నారు. పారిశ్రామికంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రత్యేకతలపై ఆరా తీశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ దేశంలోనే పరిశ్రమలకు అత్యంత అనుకూలమైన ప్రాంతం హైదరాబాద్ అని చెప్పారు.  ఎన్నో ఏళ్ల నుండి ఇక్కడ పరిశ్రమలు ఉన్నాయన్నారు. 1960 నుండే రక్షణ సంబంధ ఉత్పత్తులకు హైదరాబాద్ కేంద్రంగా ఉందని చెప్పారు.  మిషన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడే అబ్దుల్ కలాం కూడా హైదరాబాద్‌లోనే పరిశోధనలు చేశారని చెప్పారు. భారత్‌లో తయారయ్యే అన్ని రకాల క్షిపణులకు కావలసిన భాగాలను హైదరాబాద్ అందిస్తున్నదని చెప్పారు.  పరిశ్రమలకు హైదరాబాద్ సుస్థిర కేంద్రం కావడానికి ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, భూ కంపాల లాంటి అతి తీవ్రత కలిగిన ప్రకృతి వైపరీత్యాలకు దూరంగా ఉండడం, సమశీతోష్ణ వాతావరణం కారణమని ముఖ్యమంత్రి చెప్పారు. వీటితో పాటు తెలంగాణ రాష్ట్రంలో దేశంలో మరెక్కడా లేని విధంగా పెట్టుబడి దారులకు ప్రోత్సహకరంగా ఉండే పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించారు.  రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సింగిల్‌విండో విధానం, టిఎస్ ఐ పాస్ చట్టం, విధి విధానాలను ముఖ్యమంత్రి వారికి వివరించారు.

తెలంగాణలో విద్యుత్ అందుబాటు గురించి కూడా వర్మ వివరాలు అడిగారు.  ప్రస్తుతం కొంత లోటు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికి ఈ ఏడాది చివరి నాటికే తక్షణ అవసరాలు తీరేంత విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నట్లు చెప్పారు.  రెండు మూడేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారుతుందని వెల్లడించారు.  జెన్‌కో, ఎన్‌టిపిసి, సోలార్, హైడల్, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే విద్యుత్ తదితర ప్రణాళికలను ముఖ్యమంత్రి వారికి వివరించారు.  దీనికి వర్మ స్పందిస్తూ అధ్భుత ప్రణాళికలతో ముందుకు పోతున్నారని, పారిశ్రామికీకరణకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

భారత్‌లో కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి? ప్రణాళికల్లో రాష్ట్రాలకు భాగస్వామ్యం ఉందా? అనే విషయాలను కూడా వర్మ ఆరా తీశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ కేంద్రంతో తెలంగాణ రాష్ట్రానికి మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతి అయోగ్ ద్వారా రాష్ట్రాలకు భాగస్వామ్యం పెరిగిందని, ఈ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని, వచ్చే ఏడాది మెట్రో రైలు మొదటి దశ ప్రయాణాలు ప్రారంభం అవుతాయని, మెట్రో రైలును 200 కిలోమీటర్ల వరకు విస్తరిస్తున్నామని, హైదరాబాద్‌లో మరో విమానాశ్రయం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలందరికి సురక్షిత నీరు అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో మంచినీటి పథకాన్ని అమలు చేస్తున్న విషయాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థిరమైన, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలు తీసుకుంటున్నదని రిచర్డ్ వర్మ అభిప్రాయపడ్డారు. తమ దేశం హైదరాబాద్‌తో, తెలంగాణ రాష్ట్రంతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని కోరుకుంటున్నదని, తమ దేశానికి చెందిన అనేక సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి సిద్దం అవుతున్నాయని వెల్లడించారు. తమకు వివిధ వర్గాల నుండి మంచి ఫీడ్ బ్యాక్ అందిందని చెప్పారు. రిచర్డ్ వర్మకు కాకతీయ కీర్తి తోరణాన్ని ముఖ్యమంత్రి బహుకరించారు.

ఈ సమావేశంలో అమెరికా కాన్సులేట్ జనరల్ మైకేల్ సీ. ములియన్స్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఒ ముఖ్యకార్యదర్శి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఒ టు సిఎం